
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 20 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 25.080 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,740
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,545
3 శాతం జీఎస్టీతో	రూ.5,711
నవర (8 గ్రా)	రూ.45,688

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /28.0

జిల్లా వ్యాప్తంగా బుధవారం అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గాలిలో 61 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆర్డీ విచారణ



ఆర్డీ డాక్టర్ యాస్మిన్‌కు ఆహ్వానం పలుకుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు

నెల్లూరు(బారకాసు): గతంలో నెల్లూరులో డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ రాజ్యలక్ష్మిపై వచ్చిన ఆరోపణలపై బుధవారం నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆర్డీ యాస్మిన్ విచారణ చేపట్టారు. దీనికి డాక్టర్ రాజ్యలక్ష్మితోపాటు అప్పటి కార్యాలయ పరిపాలనాధికారి, అకౌంటెంట్, సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డెమో, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. వారి నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీ యాస్మిన్ మీడియాతో మాట్లాడుతూ విచారణ నివేదికను వారం రోజుల్లో రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో కేరళ బృందం పరిశీలన



ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందితో కేరళ వైద్యం బృందం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని కేరళ డాక్టర్ల బృందం బుధవారం పరిశీలించింది. వైద్యులు సరిత, సజితల నేతృత్వంలో ఆస్పత్రికి చేరుకున్న ఈ బృందం అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఓపీ రికార్డులను, రోగులకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా డీపీఓ రమేష్ మాట్లాడుతూ పరిశీలన నివేదికను కేంద్ర ఆరోగ్య శాఖకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి, కేరళ బృందానికి చెందిన ఎస్ఓ సహన, ఎంఏఎస్ రిషి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా.. సులువుగా..

రిజిస్ట్రేషన్స్ శాఖలో కొత్త మార్పులు వచ్చాయి. ప్రజలకు సులువుగా సేవలందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల పద్ధతుల్లో పలు మార్పులు, డాక్యుమెంట్ తయారీ విధానంలో కొత్త విధానాలు తీసుకొచ్చారు. ఇటీవల ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

రిజిస్ట్రేషన్స్ శాఖలో ఈ-స్టాంపింగ్ విధానం

- భూముల క్రయ, విక్రయాల్లో పారదర్శకత
- మాన్యువల్‌గా స్టాంపుల విక్రయాలు బంద్
- జిల్లాలో 35 స్టాంప్ వెండర్లకు అనుమతి



ఈ-స్టాంప్‌ను అందజేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలకు చెక్ పెట్టే దిశగా అడుగులు వేసింది. గతంలో పాత తేదీలతో స్టాంపులు కొనుగోలు చేసి తద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడేవారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. ఈ-స్టాంపింగ్‌తో భూముల క్రయ, విక్రయాలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఈ పక్రియ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రాధాన్యం పొందుతోంది. ఏరోజుకారోజు అనే నినాదంతో ఈ-స్టాంపుల విక్రయాలను చేపట్టింది. దీనికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సైతం అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసేందుకు ఇప్పటికే 101 గ్రామ సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఈ-స్టాంపింగ్ విధానం జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో స్టాంప్ వెండర్లకు సంబంధించి మొత్తం 35 ఈ-స్టాంప్ సెంటర్లకు అనుమతులిచ్చారు. మాన్యువల్ స్టాంపుల విక్రయాలు పూర్తిస్థాయిలో నిలుపుదల చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు ఈ-స్టాంప్‌ల వినియోగంపై దృష్టి సారించాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వెండర్లకు లైసెన్స్‌లు

ఇప్పటి వరకు నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల ద్వారా భూముల క్రయ, విక్రయాలు జరిగేవి. వీటిలో డాక్యుమెంట్ రైటర్లు కీలక భూమిక పోషించేవారు. ప్రస్తుతం ఈ-స్టాంప్‌ల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న వెండర్లతో (విక్రయదారులు)పాటు కొత్తవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ-స్టాంపింగ్ కంప్యూటర్ పరిజ్ఞానంతో చేపట్టాల్సి ఉండడంతో పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నిర్దేశించిన సమయంలోగా లైసెన్స్‌లు జారీ చేయనున్నారు.

ఇప్పటికే డిజిటలీకరణ

స్టాంప్‌లు రిజిస్ట్రేషన్ శాఖలో పాత డాక్యుమెంట్ల డిజిటలీకరణకు ప్రభుత్వం ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 1850 నుంచి 1999 వరకు జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలైతే రికార్డులు వెతికి మాన్యువల్‌గా రాసివ్వాల్సిన ప్రయాసలకు విముక్తి కలుగుతుంది. ప్రస్తుతం ఈ-స్టాంపింగ్ తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ ఇకపై పూర్తి పారదర్శక సేవలు అందించనుంది.

ఈ-స్టాంప్‌తో భద్రత

నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల కంటే ఈ-స్టాంప్‌లకు ఎక్కువ భద్రత ఉంటుంది. వీటిని ట్యాంపరింగ్ చేయడం కుదరదు. అంతే కాకుండా పాత తేదీల స్టాంప్‌లు విక్రయించే అవకాశం ఉండదు. గతంలో మాదిరిగా దస్తావేజులను అధిక ధరలకు కొనే బాధ కూడా తప్పుతుంది. ఆయా కేంద్రాల్లో దరఖాస్తులను పూర్తి చేసి వారికి ఇస్తే నిమిషాల్లో ఈ-స్టాంప్‌లను ఇస్తారు. రూ.10 నుంచి ఎన్ని వందల రూపాయలకు కావాలన్నా తీసుకోవచ్చు. ఈ-స్టాంపింగ్ విధానాన్ని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రిజిస్ట్రేషన్‌లు శాఖ అమలు చేస్తోంది.



నెల్లూరులోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

సేవల్లో పారదర్శకత

ఆస్తులు రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్ల కోసం గతంలో దస్తావేజులు (నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు) వినియోగించాల్సి వచ్చేది. ప్రజలకు పారదర్శకతతోపాటు సులువైన పద్ధతిలో సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం అనుమతించిన సెంటర్లలో ఎంత డినామినేషన్ ఈ-స్టాంప్‌లు అవసరమో వాటిని సులువుగా పొందవచ్చు. ఈ-స్టాంప్ విధానం ద్వారా ట్యాంపరింగ్‌కు, అవకతవకలకు ఆస్కారం ఉండదు.

– బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

జొన్నవాడలో కోటి కుంకుమార్చన



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



పూజలు నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- ఘనంగా కల్యాణ మహోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో బుధవారం కోటి కుంకుమార్చన మహాయజ్ఞం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. వేంకటేశ్వర స్వామి దేవస్థాన సలహా మండలి, ఉత్తర భారతదేశ తిరుమల, తిరుపతి దేవస్థానాల ఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సుమారు 100 మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహాయజ్ఞ కార్యక్రమాన్ని చేశారు. వీరంతా కుంకుమతో 10 లక్షల ఆవర్తనాలను పఠించారు. మధ్యాహ్నం మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామికి ఘనంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ, ఉభయకర్తలు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై చంద్రబాబు దుష్ప్రచారం

- గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విద్యుత్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ఉచిత విద్యుత్‌పై ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పొదలకూరు విద్యుత్ సబ్‌స్టేషన్లో రూ.95 లక్షలతో ఏడీఈ, ఏఈ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మీటర్లు అమర్చుతామంటే టీడీపీ నాయకులు గ్రామాల్లో రైతులను రెచ్చగొడుతున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు పెడితే 33 శాతం విద్యుత్ ఆదా అయ్యిందని, ఇందువల్ల రైతులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదన్నారు. మీటర్లు ఏర్పాటు చేసినా ప్రభుత్వమే భరించి ఉచిత విద్యుత్‌ను రైతులకు సరఫరా చేస్తుందన్నారు. అక్రమంగా విద్యుత్ వాడకం దారులు బయట పడి విద్యుత్ గణనీయంగా ఆదాఅవుతుందన్నారు. త్వరలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తుందని, ఇందువల్ల గ్రామాల్లో సైతం పరిశ్రమల స్థాపనకు అవకాశం కలుగుతుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. పొదలకూరును విద్యుత్ సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈ బి.వెంకటసుబ్బయ్య, ఈఈలు జయకృష్ణారెడ్డి, కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ వీరవసంతరావు, ఎంపీడీఓ నగేష్ కుమారి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమ అరుణ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు జి.శ్రీనివాసులు, జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు దుర్భిక్షం.. నేడు జలకళ

- టీడీపీ హయాంలో రాళ్లపాడు ప్రాజెక్ట్ కింద పండని పంటలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సమృద్ధిగా నీరు
- ప్రతి ఎకరాలో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు
- వలేటివారిపాలెం సభలో ప్రాజెక్ట్ అభివృద్ధిపై లోకేశ్ అసత్య ఆరోపణలు
- ప్రభుత్వం నిధులు కేటాయించినా ఇవ్వలేదంటూ ప్రచారం

టీడీపీ ప్రభుత్వ హయాంలో రాళ్లపాడు ప్రాజెక్ట్ అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసి ప్రాజెక్ట్ అభివృద్ధికి కృషి చేస్తున్నా టీడీపీ నేత నారా లోకేశ్ తన పాదయాత్రలో అసత్య ఆరోపణలు చేసి విమర్శల పాలయ్యారు. ప్రాజెక్ట్ స్థితిగతులను పరిశీలిస్తే గత ప్రభుత్వంలో దుర్భిక్ష పరిస్థితుల నెలకొనగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జలకళ సంతరించుకుని ఏటా రైతులు పంటలు సాగు చేసుకుంటూ సంతోషంగా ఉన్నారు.



రాళ్లపాడు ప్రాజెక్ట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు పంటలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 సీజన్ నుంచి నేటి వరకు ప్రాజెక్ట్‌లో నీరు సమృద్ధిగా నిల్వ ఉంటోంది. నాలుగేళ్లలో ఎప్పుడూ ప్రాజెక్ట్ కింద కరువు అన్న మాటే లేదు. పూర్తి ఆయకట్టులో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. పూర్తి సామర్థ్యం 1.1 టీఎంసీల (20 అడుగుల) మేరకు నీరు నిల్వ ఉంటోంది. పలు గ్రామాల్లో ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తున్న రైతులు కూడా ఉన్నారు. ప్రధానంగా వరి, పత్తి పంటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కూడా ప్రాజెక్ట్‌లో సుమారు 11.7 అడుగుల మేర నీరు నిల్వ ఉండడం గమనార్హం. అంటే ఈ ఏడాది కూడా పంటల సాగుకు దాదాపు నీటి ఇబ్బంది లేనట్టే.

కందుకూరు: నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరు రాళ్లపాడు ప్రాజెక్ట్. దాదాపు నాలుగు మండలాల రైతులు దీనిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్షాలు కురవక ప్రాజెక్ట్‌లో నీరు కరువై రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పాజెక్ట్ జలకళ సంతరించుకోవడంతో అన్నదాతలు ఏటా పంటలు సాగు చేసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న ఐదేళ్లలో కేవలం ఒక్క ఏడాది మాత్రమే అరకొరగా పంటలు పండగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వరుసగా నాలుగేళ్లు ప్రాజెక్ట్ పరిధిలో పూర్తి ఆయకట్టు సాగులోకి వచ్చింది. కానీ ఈ వాస్తవాలను పక్కన పెట్టిన టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రలో రాళ్లపాడు ప్రాజెక్ట్‌పై అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని రైతులు చెబుతున్నారు.

25 వేల ఎకరాల ఆయకట్టు

రాళ్లపాడు ప్రాజెక్ట్ పరిధిలో ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా మొత్తం 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంటుందని అంచనా. ప్రాజెక్ట్‌కు ఉన్న కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. 20.14 కి.మీ. పొడవున్న కుడి కాలువ కింద లింగసముద్రం, గుడ్లూరు, కొండాపురం మండలాల పరిధిలో 14,500 ఎకరాల అధికారిక ఆయకట్టు ఉంది. అలాగే 3 కి.మీ. పొడవున్న ఎడమ కాలువ కింద లింగసముద్రం మండల పరిధిలో 1,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ కాలువను పొడిగించడం ద్వారా మరో 2,500 ఎకరాలకు నీరు అందించాలనేది ప్రతిపాదన. మిగిలినది అనధికారిక ఆయకట్టు కింద సాగవుతోంది. ప్రాజెక్ట్ పూర్తి నీటి సామర్థ్యం 1.1 టీఎంసీలు. కానీ పూర్తి ఆయకట్టు పండటానికి 2.2 టీఎంసీల నీరు అవసరమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్ట్‌లో నీటి సమస్యను పరిష్కరించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సోమశిల ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీలను కేటాయించారు. అవసరమైన సందర్భంలో సోమశిల నుంచి నీరు తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

పాదయాత్రలో భాగంగా వలేటివారిపాళెంలో జరిగిన బహిరంగ సభలో నారా లోకేశ్ ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్ట్ అభివృద్ధికి నిధులివ్వడం లేదంటూ పలు ఆరోపణలు చేశారు. వాస్తవానికి అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు నిధులు ఇవ్వకుండా జాప్యం చేసింది నాటి టీడీపీ ప్రభుత్వమే. అంతేకాకుండా 2017లో జీఓ నంబర్ 40ను విడుదల చేసి రాళ్లపాడు ప్రాజెక్ట్ నుంచి కామధేను ప్రాజెక్ట్‌కు రోజూ 5 లక్షల లీటర్ల నీటిని తరలించే ప్రయత్నం చేసింది. దీనిపై అప్పట్లో రాళ్లపాడు ప్రాజెక్ట్ రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేయడంతో ఆ జీఓను ఉపసంహరించుకుంది. ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చొరవతో ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వీటిలో ప్రధానంగా ఎడమ కాలువను పొడిగించడంతోపాటు, సోమశిల జలాశయం నుంచి సక్రమంగా నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా గతేడాది జూలై 20వ తేదీన రామాయపట్నం పోర్టు భూమిపూజ సభలో ఎడమ కాలువ పొడిగింపునకు నిధులు మంజూరు చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే వెలిగొండ ప్రాజెక్ట్ కాలువ నుంచి అదనంగా ఒక టీఎంసీ నీటిని మళ్లించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఈ పనులు పూర్తయితే వర్షాధారిత ప్రాజెక్ట్ కాస్త నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉండే ప్రాజెక్ట్‌గా మారే అవకాశం ఉంది.

గత ప్రభుత్వంలో..

మన్నేరుపై ఉన్న రాళ్లపాడు ప్రాజెక్ట్ పూర్తిగా వర్షాధారితమైంది. సకాలంలో వానలు పడి ప్రాజెక్ట్‌లోకి నీరు చేరితేనే పంటలు పండుతాయి. లేకుంటే ఆ ఏడాది పొలాలు బీడు పెట్టుకోవాల్సిందే. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఇదే పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్ట్ గుణాంకాలే ఇందుకు నిదర్శనం. 2012 నుంచి 2015 మధ్యలో నీరు లేక పంటలు సాగు కాలేదు. 2015–16 సీజన్‌లో అరకొరగా పంటలు పండాయి. 25 వేల ఎకరాల ఆయకట్టుకు గానూ కేవలం 12 వేల ఎకరాల్లో మాత్రమే పంటల సాగు జరిగింది. తిరిగి 2016–17 సీజన్ నుంచి 2018–19 సీజన్ వరకు కరువు వచ్చింది. వర్షాభావంతో ప్రాజెక్ట్ పూర్తిగా ఎండిపోయింది. దీంతో 25 వేల ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. ఏడాదికి దాదాపు రూ.250 కోట్ల విలువ చేసే పంటలను రైతులు నష్టపోయారు. నాడు నెలకొన్న తీవ్ర దుర్భిక్షంతో ప్రాజెక్ట్ పరిధిలోని రైతులు నగరాలకు వలస వెళ్లిన పరిస్థితులున్నాయి.

పునరావాస కాలనీల్లో వేగంగా పనులు

- కలెక్టర్ హరినారాయణన్
- 13 మంది రైతులకు పరిహారం పంపిణీ



చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. స్థానిక పోర్టు కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ బుధవారం పునరావాస కార్యక్రమాలు, భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. అధికారులు పనుల్లో పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ ఆవులవారిపాళెం, మొండివారిపాళెం గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీల్లో పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కంపెనీ ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?, ఎప్పుడు పూర్తి చేస్తారు? అనే విషయాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కర్లపాళెం గ్రామం కూడా త్వరలో ఖాళీ అవుతున్నందున వారికి సంబంధించిన పునరావాస కాలనీ అంశాలపై చర్చించారు.

రూ.13.5 కోట్లతో..

పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రూ.13.5 కోట్లతో రెండు గ్రామాల నిర్వాసితులకు పునరావాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు గ్రామాల నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని, కర్లపాళెం నిర్వాసితులకు భూసేకరణ పూర్తయిందన్నారు. 2024 జనవరి నాటికి మొదటి షిప్‌ను తీసుకొచ్చేందుకు అరబిందో ఇన్‌ఫ్రా కంపెనీ రేయింబవళ్లు పనులు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టుకు భూమిపూజ చేసి ఏడాది పూర్తవుతుందన్నారు. కలెక్టర్ స్వీయ పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొదటి షిప్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 40 వేల మెట్రిక్ టన్నుల రాయిని వినియోగించారని, నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం 13 మంది రైతులకు రూ.1.66 కోట్ల చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పోర్టు లోపల జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, సబ్ కలెక్టర్ శోభిక, వైస్ చైర్మన్ నాగార్జున, అరబిందో కంపెనీ జనరల్ మేనేజర్ భీముడు, పోర్టు, లైజనింగ్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, భూ సేకరణ ప్రత్యేకాధికారి పద్మావతి, తహసీల్దార్ సూర్యనారాయణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



సంగం: మండలంలోని పడమటిపాళెంలో బుధవారం వేణు అనే పాడి రైతుకు చెందిన గేదె రెండో ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు పడ్డ దూడలు, గేదె ఆరోగ్యంగా ఉన్నాయి. ఇలా ఎప్పుడూ జరగలేదని, తమకు చాలా ఆనందంగా ఉందని రైతు వేణు తెలిపారు. గ్రామస్తులు రెండు దూడలను ఆసక్తిగా చూశారు.

బాబు, పవన్‌ల డ్రామాలను ప్రజలు నమ్మరు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇందుకూరుపేట: చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్ని డ్రామాలు ఆడినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రావూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఎన్నికలు వస్తున్నాయని పెద్దపెద్ద వాహనాలు ఎక్కి రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామని చెబుతున్నారన్నారు. మీరంతా ఈ నాలుగేళ్లలో ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. కరోనా సమయంలో చంద్రబాబు హైదరాబాద్‌లో భార్యాబిడ్డలతో కాలం గడిపాడని, పవన్ అయితే ఎక్కడ ఉన్నాడో తెలియదన్నారు. ఆ రోజు ప్రజలు గుర్తుకురాలేదా.. ఇప్పుడు ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను తిడుతూ విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ పాదయాత్ర చేసి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారని, ఒక్క పథకాన్ని కూడా నిలుపుదల చేయలేదన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టి టీడీపీ వాళ్లు లబ్ధి పొందేలా చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న మంచి పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఇష్టానుసారం మాట్లాడుతున్నాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏపీ డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, నాయకులు ఉడతా వెంకటశేషయ్య, ముంగర శ్రీకాంత్ పాల్గొన్నారు.

నెలాఖరులోపు జీఐఎస్ పనుల పూర్తి

- ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు


మాట్లాడుతున్న సుబ్బరాజు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) టెక్నాలజీ జియో ట్యాగింగ్ పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎస్వీఎస్ సుబ్బరాజు ఆదేశించారు. ఆయన బుధవారం నెల్లూరు నగరానికి విచ్చేశారు. విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో రూరల్ డివిజన్ల విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ జీఐఎస్‌పై సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ మెయింటెన్స్ ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 30 రోజుల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టటం వల్ల ఉచిత విద్యుత్‌కు వచ్చిన ప్రమాదం ఏమి లేదన్నారు. విద్యుత్ వినియోగించుకున్న రైతులు చెల్లించాల్సిన బిల్లులకు సంబంధించిన నగదు మొత్తాన్ని ప్రభుత్వం డీబీటీ ద్వారా వారి బ్యాంకు అకౌంట్లోకి జమ చేస్తుందన్నారు. 'జగనన్నకు చెబుతాం' కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఈఈ జయకృష్ణారెడ్డి, డీఈఈ సునీల్, అశోక్, సురేంద్ర, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు సుబ్బారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జిల్లాలో డెంగీ కేసుల నమోదు
- నీటి నిల్వలతో ప్రమాదం
- దోమల నియంత్రణకు చర్యలు
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు


క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది (ఫైల్)

నెల్లూరు(బారకాసు): వర్షాకాలంలో పలు రకాల వ్యాధులు మనిషిపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉంటాయి. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది పలు రకాల వ్యాధులను వ్యాపింపజేస్తాయి. దోమకాటు ద్వారా డెంగీ జ్వరం వస్తుంది. దీనిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కోసం ప్రతి ఏడాది జూలై నెలను డెంగీ వ్యతిరేక నెలగా ప్రకటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో మలేరియా కేసులు తగ్గిపోయి ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో అత్యంత ప్రమాదకరమైన డెంగీ జ్వరాలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో కేసులు బయట పడుతున్నాయి. మంగళవారం నాటికి 96 కేసులు నమోదయ్యాయి. ఇందులో 37 నెల్లూరు నగరంలోనే ఉన్నాయి. మిగిలినవి కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చి మున్సిపాల్టీలతో పాటు గ్రామాల్లోనూ నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు. అనధికారికంగా కేసులు ఇంకా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది.

ఏం చేస్తున్నారంటే..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తమవుతున్నారు. సీజన్ మార్పు నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి డెంగీ వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వలంటీర్లు, సూపర్‌వైజర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో పక్క వ్యాధి లక్షణాలతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వచ్చే వారికి వైద్యులు ముందుగా ర్యాపిడ్ పరీక్ష చేస్తున్నారు. ఇందులో డెంగీ నిర్ధారణ అయితే వెంటనే బాధితులను నెల్లూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల (జీజీహెచ్), ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, కావలి, కందుకూరులోని ఏరియా ఆస్పత్రులకు పంపుతున్నారు. అక్కడ ఎలీసా టెస్ట్ నిర్వహిస్తున్నారు. రక్తకణాల సంఖ్య తక్కువగా ఉంటే రక్తం, ప్లేట్‌లెట్లు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ

సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి అనే సాకుతో రూ.వేలు వసూలు చేస్తున్నాయి. డెంగీ వస్తే ప్రభుత్వానికి సమాచారం తెలియజేయాలి. నమూనాలు పంపించాలి. ఇవేమి లేకుండా రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నాయి.

నాలుగేళ్లలో జిల్లాలో..

జిల్లాలో 2020లో 28 మంది, 2021లో 139 మంది, 2022లో 148 మంది, 2023 జులై 18వ తేదీ వరకు 96 మంది డెంగీ జ్వరం బారినపడ్డారు. 2020 నుంచి 2023 ఇప్పటి వరకు 27 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 3,418 నమూనా పరీక్షలు చేయగా 96 డెంగీ, 2 మలేరియా కేసులొచ్చాయి.

ప్రజలకు అవగాహన



డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించాం. వలంటీర్లు, ఆశావర్కర్ల ద్వారా కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే తొలగించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత పంచాయతీ/వార్డు శానిటరీ సెక్రటరీలకు సూచించాం. డెంగీ నిర్ధారణ అయిన ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్లలో నీటిని తనిఖీ చేసి లార్వాలుంటే నాశనం చేస్తున్నాం.

– హుస్సేనమ్మ, జిల్లా మలేరియా అధికారిణి

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో అర్హత కలిగిన 9, 10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పీఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించరాదన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు సెప్టెంబర్ 29వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు https://yet.nta. ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5



వివాదాస్పదంగా హఫీజ్ పాషా వ్యవహారశైలి

- ఏఎస్‌పేట దర్గా ఈఓపై దౌర్జన్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదులో జాప్యం

ఆత్మకూరు: ఏఎస్‌పేటలోని ఖాజా నాయబ్ రసూల్ దర్గా మాజీ పీఠాధిపతి హఫీజ్ పాషా వ్యవహారశైలి మరోసారి వివాదాస్పదమైంది. త్వరలో రొట్టెల పండగ జరుగనున్న నేపథ్యంలో హఫీజ్ దర్గాలో ఆధిపత్య ప్రదర్శనకు దిగారు. ప్రార్థనలు నిర్వహించి ఆదాయం పొందేందుకు ప్రయత్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తమకు మతపరమైన హక్కులు కల్పించారని సోమవారం రాత్రి ఫాతేహా నిర్వహించడం, తాయత్తులు విక్రయించడం, గలేఫాలు, చద్దర్లు తమకే చెందుతాయని వాటిని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అక్కడ విధుల్లో ఉన్న దర్గా ఈఓ మహమ్మద్ హుస్సేన్ ఇలా చేయడం సరికాదని హఫీజ్‌కు చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. అయినా పలు గలేఫాలు, చద్దర్లను హఫీజ్ అనుచరులు తీసుకెళ్లారు. దీంతో ఈఓ స్థానిక పోలీసులతోపాటు జిల్లా ఎస్పీ కార్యాలయానికి, వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాలను వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్ దృష్టికి ఈఓ తీసుకెళ్లారు. హఫీజ్ కేవలం మతపరమైన విధులు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని, హక్కులు కల్పించలేదన్నారు. ఈ విషయాలను వివరిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయానికి ప్రత్యేకాధికారి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డిని వివరణ కోరగా ఈఓ ఫిర్యాదు చేసిన విషయం తనకు పూర్తిగా తెలియలేదన్నారు. సీఐ విచారణ చేస్తున్నారని నివేదిక మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కొబ్బరికాయలు అమ్మనివ్వడంలేదని హఫీజ్ పాషా బంధువులు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయాన్ని దర్గా ఈఓతో మాట్లాడుకోవాలని చెప్పినట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కందుకూరు రూరల్: కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అండర్–14 విభాగంలో సీహెచ్ శివకార్తీక్, వి.సాయిచరణ్, ఎం.ప్రణయ్ కుమార్, సీహెచ్ చంటి, జి.నవదీప్, ఎస్.ప్రవీణ్, కె.జశ్వంత్‌కుమార్, సీహెచ్ చరణ్, చందుతేజ, సూర్య, విల్సన్ ఎంపికైనట్లు వెల్లడించారు. వీరు ఈనెల 21వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి తదితరులు అభినందించారు.

కుష్టు రహిత సమాజం కోసం కృషి

నెల్లూరు(బారకాసు): జిల్లాలో 2027 కల్లా కుష్టు రహిత సమాజం కోసం కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ ఆర్డీ జొన్నలగడ్డ యాస్మిన్ అధికారులకు సూచించారు. విచారణ నిమిత్తం బుధవారం నెల్లూరుకు వచ్చిన ఆమె స్థానిక వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ (డీఏఎల్‌టీ) నివారణ విభాగంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను విడనాడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత కేసులను గుర్తించేందుకు చేస్తున్న సర్వేను వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలను కూడా ఈ విషయంలో భాగస్వాములు చేయాలని సూచించారు. సమావేశంలో డీఏఎల్‌టీ అధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డితోపాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాతో మరో వృద్ధుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ ఎస్సీ కాలనీలో డయేరియాతో ఇప్పటికే ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ఈదూరు నారాయణ (75) అనే వృద్ధుడు నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఇప్పటి వరకు గ్రామంలో డయేరియాతో ముగ్గురు వృద్ధులు చనిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అప్రమత్తమైన వైద్య సిబ్బంది స్థానికంగా ఉన్న చర్చిలో చికిత్స పొందుతున్న రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

22న రోప్ స్కిప్పింగ్ పోటీలు

కందుకూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 22వ తేదీన రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని కార్యదర్శి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో బాలుర, బాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 89190 36160 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 156